బదిలీకో రేటు!

మొదటిపేజీ తరువాయి...

అటవీ శాఖను కుదిపేస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదలైన మార్పుల్లో భాగంగా తొలుత ప్రభుత్వ స్థాయిలో కాకుండా.. డిపార్ట్‌మెంట్ స్థాయిలో ఉండే బదిలీలపై అటవీ శాఖలోని కీలక వ్యక్తి సహాయకుడి కన్నుపడింది. ఫిబ్రవరిలోనే బదిలీలు చేయడం ఎలా అన్నదానిపై కసరత్తు మొదలు పెట్టి బేరసారాలకు తెరతీశారు. అటవీ శాఖ ఉద్యోగులై ఉండి ఇతర శాఖల్లో పనిచేస్తున్నవారి వివరాలు తెప్పించాడు. వారికి బదిలీలు ఎలా అన్నదానిపై కసరత్తు చేశారు. ప్రభుత్వ స్థాయిలో కాకుండా కేవలం కిందిస్థాయిలో పనులు చేయించుకోవడంపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో డిప్యూటేషన్లపై ఉన్నవారిపై దృష్టిపెట్టారు. రెండేండ్లకుపైగా ఏదైనా శాఖలో డిప్యూటేషన్‌పై ఉంటే ఆ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి ఇది మంచిదే. కానీ, ఇదే అదనుగా ఆయా స్థానాల్లోకి వచ్చేవారితో, ఆ స్థానాల నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉన్నవారిలో కొందరితో సహాయకుడు బేరసారాలు నడిపాడు. ఇలాంటి పోస్టులకు రూ.5-10 లక్షలను వసూలు చేసేందుకు లక్ష్యాలు విధించుకోడం గమనార్హం. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫారెస్ట్ కాలేజీ, అకాడమీ.. ఇలా అనేక ప్రాంతాల్లో సుమారు 30 మందికిపైగా డిప్యూటేషన్‌పై ఉన్నారు. వీరి స్థానాల్లోకి వచ్చేందుకు మరో 30 మంది ఉన్నారు. అంటే 60 మందికి స్థానభ్రంశం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. పోనీ ఇదంతా పారదర్శకంగా చేస్తున్నారా.. అంటే అదీ లేదు. హెచ్‌ఎండీఏలో పనిచేస్తున్న ఒకరు మూడేండ్లుగా, మరొకరు అయిదేండ్లుగా అక్కడే పనిచేస్తున్నా డిప్యూటేషన్ రద్దు చేయలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కాళేశ్వరం సీసీఎఫ్‌గా ప్రభాకర్‌ను బదిలీ చేశారు. ములుగు డీఎఫ్‌వోను ఒక మంత్రి సిఫార్సుతో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక అధికారి ఉమ్మడి మెదక్ జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో రానున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఫారెస్ట్ అకాడమీ నుంచి ఒక అధికారి కూడా మెదక్ జిల్లాలోని మరో కీలక పోస్టులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మూడు నెలల క్రితం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కూడా ఒక అధికారి ఇలాగే హెచ్‌ఎండీఏకు వచ్చారు. ఆయన ఒక సంఘానికి నాయకుడు కూడా కావడం గమనార్హం.

అడ్డగోలుగా వసూళ్లు.. కన్సెంట్ ఇవ్వకపోయినా ఆర్డర్లు

అటవీ శాఖలో బదిలీ బాగోతం జరుగుతున్నదని అక్కడి ఉద్యోగులు వాపోతున్నారు. కొందరు కీలక వ్యక్తికి దగ్గరి వాళ్లమని చెప్తూ పైరవీలు మొదలుపెట్టారని చెప్తున్నారు. రేంజ్ ఆఫీసుల్లో పోస్టింగ్‌లు ఇప్పిస్తామంటూ ఒక రేంజ్‌లో వసూ లు చేస్తున్నారని సాక్షాత్తు అటవీ శాఖ ఉద్యోగులే వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు ప్రతి రోజూ హైదరాబాద్‌లోని అటవీ శాఖ అధికారు లు, దళారుల చుట్టూ తిరుగుతూనే కనిపిస్తున్నా రు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక అధికారిని బదిలీ చేయాలంటే అంత సులువుగా అయ్యేది కాదు. కానీ, ఇప్పుడు ఎవరు ఎప్పు డు, ఎక్కడి నుంచి బదిలీ ఆర్డర్ తెప్పించుకుంటారో అన్న అనుమానంతో దిన దిన గండం నూరేండ్ల ఆయుష్షులా కాలం వెళ్లదీస్తున్నారు. డిప్యూటేషన్‌పై ఏదైనా శాఖకు వెళ్లాలంటే సం బంధిత శాఖ అధికారులు కూడా కన్సెంట్ లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, అటవీ శాఖలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తున్నది. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, విజిలెన్స్ తదితర శాఖల్లోకి కొంతమంది డిప్యూటేషన్ ఉత్తర్వులను పట్టుకొని వెళ్తున్నారు. ఉత్తర్వులను చూసిన సంబంధిత శాఖ అధికారులు 'మాకు ఇప్పుడు అటవీ శాఖకు సం బంధించిన పనులేమీ లేవు. మిమ్మల్ని ఏం చేసుకోవాలి?' అని ప్రశ్నిస్తే.. 'మాకు అదంతా తెలియదు.. జాయిన్ చేసుకొని, ఫలానా విభాగాన్ని మాకు అప్పగించండి' అంటూ దబాయిస్తున్నారు. ఇది ఆయా శాఖలకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నది. హెచ్‌ఎండీఏకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఒక చిన్నస్థాయి అధికారిణి రూ.కోట్ల విలువ చేసే పనులను ఎగ్జిక్యూట్ చేస్తున్నారు. ఆమె కన్నా సీనియర్లు, ఆమె కన్నా పనిమంతులు ఉన్నప్పటికీ అక్కడ ఆమె చెప్పిందే నడుస్తున్నదని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

ఈ జాగలు నావే!

- వరంగల్‌లోని మారుతి కాలనీ ప్లాట్లపై మాజీ ప్రజాప్రతినిధి కన్ను!
- ఖాళీ ప్లాట్లలో కేఎం పేరుతో ఖనీలు
- స్థలాలు మావేనంటూ అనుచరుల దౌర్జన్యం

వరంగల్‌లోని 56వ డివిజన్ మారుతీ కాలనీలో కేఎం పేరుతో నాటిన ఖనీలు

వరంగల్, జూన్ 20 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో కబ్జాలు పెరిగిపోతున్నాయి. పలుకుబడి ఉన్న ప్రజాప్రతినిధులు ఖాళీ భూములపైనే కాదు కట్టిన ఇండ్లపైనా కన్నేస్తున్నారు. కీలక ప్రజాప్రతినిధి భర్త, మాజీ ప్రజాప్రతినిధి ఇప్పుడు ఏకంగా వరంగల్ నగరంలోని ఓ కాలనీని తనదిగా మార్చుకునే ప్రయత్నం చేశాడు. వరంగల్ మహానగరం 56వ డివిజన్‌లోని జవహర్‌కాలనీ రోడ్డు మారుతి కాలనీలో ఏండ్లుగా ఇండ్లు కట్టుకుని ఉంటున్న ప్రాంతంలో పదిమంది వ్యక్తులు రాత్రికి రాత్రి సిమెంటు ఖనీలు తెచ్చి వేశారు. బుధవారం మధ్యాహ్నం తర్వాత కొన్ని ఖనీలను మారుతినగర్ కాలనీ 7వ నంబర్ రోడ్డు వెంట, ఖాళీ ప్లాట్లలో, ఇండ్ల ముందు పాతారు. వీటిపై ఎర్ర రంగుతో ఇంగ్లిష్‌లో కేఎం అని రాసి ఉన్నది. అక్కడక్కడా కొన్ని ఖనీలు వేసి ఉన్నాయి. మారుతినగర్ కాలనీలోని ఇప్పుడు ఇండ్లున్న ప్రాంతం మాజీ ప్రజాప్రతినిధి స్థలమేనని, రికార్డుల్లో ఆయన పేరు మీదనే ఉన్నదని ఆయన అనుచరులు చెబుతున్నారు. మొత్తం ఏరియా తమ నాయకుడిదేనని, కొందరు ఇండ్లు కట్టుకున్నా ఏమీ అనలేదని, ఖాళీగా ఉన్న ప్లాట్లను మాత్రం వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సదరు మాజీ ప్రజాప్రతినిధికి ఈ ప్రాంతంలోనే విశాలమైన ఫామ్ హౌస్ ఉన్నది. ఒకప్పుడు నగర శివారు ప్రాంతమైనా ఇప్పుడు నగరం మధ్యలో ఉన్నది. ఫామ్‌హౌస్‌కు సమీపంలోనే మారుతి కాలనీ ఉన్నది. ఈయన ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఈ ప్లాట్ల విషయం వివాదాస్పదమైంది. రికార్డుల ప్రకారం భూమి తన పేరుతోనే ఉన్నదని, తన భూములకు తగిన మేరకు డబ్బులు ఇవ్వాలని అప్పట్లో హెచ్చరించినట్టు స్థానికులు చెబుతున్నారు. వివాదం ఎందుకనే ఉద్దేశంతో చాలామంది అప్పుడే సెటిల్ చేసుకున్నారని తెలిసింది. ఆ తర్వాత మారుతినగర్‌లో చాలామంది ఇండ్లు కట్టుకున్నారు. కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు ఆ స్థలాలు తమవేనని మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు వచ్చి హంగామా చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తెచ్చి న్యాయం చేయాలని కోరుతున్నారు.

అధికారుల మౌనం..

మారుతి కాలనీలో ఖనీలు నాటిన విషయమై పలువురు కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోజంతా గడిచినా ఎవరూ రావడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకుని ఉంటున్న ఈ ప్రాంతంలో ఇప్పుడు కేఎం పేరుతో ఖనీలను పాతడంపై కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక కార్పొరేటర్‌కు తమ గోడు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తే ఆయన కూడా అందుబాటులోకి రావడంలేదని అంటున్నారు. ఈ డివిజన్ కార్పొరేటర్ ఇటీవలే అధికార పార్టీలో చేరాడు. పెద్దల విషయం తనకెందుకనే ధోరణిలో ఆయన ఎవరినీ కలవడంలేదని తెలిసింది.

అనంతగిరి రైతులకు ఆరు వారాల్లో పరిహారం

- పునరావాస ప్రయోజనాలు, రిజర్వాయర్ భూసేకరణపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న అనంతగిరి రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం, పునర్నిర్మాణ (ఆర్‌అండ్‌ఆర్) ప్రయోజనాలు కల్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తీర్పు ప్రతి అందిన ఆరు వారాల్లో పరిహారం అందజేయాలని, అప్పటివరకు భూములనుంచి వారిని ఖాళీ చేయించరాదని స్పష్టంచేసింది. అనంతగిరి రిజర్వాయర్ కోసం చేపట్టిన భూసేకరణను సవాలు చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన సీహెచ్ లక్ష్మారెడ్డి మరో 29 మంది రైతులు 2018లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల తీర్పు వెలువరించారు. పునరావాస ప రిహారం చెల్లించామని అధికారులు చెప్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు చూపలేదన్నా రు. సేకరించిన భూములకు పునరావాస ప్రయోజనాలు కల్పించేదాకా ఖాళీ చేయించరాదని హైకోర్టు 2018లోనే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, అయినా ఉల్లంఘించడంతో కోర్టు ధిక్కరణ కింద శిక్ష విధించిందని చెప్పారు.

పోస్టింగ్స్‌లో మంత్రి సోదరుడికి ముడుపులు

- అవి పోలీస్‌స్టేషన్లా? కాంగ్రెస్ పార్టీ ఆఫీసులా?
- నేతల కనుసన్నల్లో పనిచేసేవారికే ప్రాధాన్యమిస్తారా?
- కాళేశ్వరానికి మాయని మచ్చగా ఎస్సై వ్యవహారం
- కాంగ్రెస్ ఆర్నెల్ల అభివృద్ధి శూన్యం.. అవినీతి ఆకాశానికి
- మీడియాతో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

మంథని, జూన్ 20: మంథని నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లు ప్రజలకు రక్షణ కల్పించే రక్షకభట కేంద్రాలా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలా? అని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు.. తమ కనుసన్నల్లో పనిచేసే పోలీసు అధికారులను ట్రాన్స్‌ఫర్ల మీద మంథని నియోజకవర్గానికి తీసుకొస్తున్నారని ఆరోపించారు. గురువారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని రాజగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను రక్షించాల్సిన బాధ్యతలో ఉన్న కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ అదే స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడటం సహించరాని నేరమని చెప్పారు. భవానిసేన్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ ఓ మహిళపై లైంగికదాడికి ప్రయత్నించగా.. అధికారులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ఎస్సైకి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత ఎమ్మెల్యే, మంత్రి సోదరుడు ఎస్సై నుంచి రూ.20 లక్షలు తీసుకొని కాళేశ్వరంలో పోస్టింగ్ ఇప్పించారని ఆరోపించారు. స్టేషన్‌కు వచ్చేవారికి సదరు ఎస్సై ఓ మంత్రి, ఆయన సోదరుడి పేరును చెప్తూ బెదిరింపులకు పాల్పడే వారని విమర్శించారు. మంథని నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయని ఆరోపించారు. అందుకు ఇటీవల మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆ మండల జడ్పీటీసీ భర్త నృత్యాలు చేయడమే నిదర్శనమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అవినీతి మాత్రం ఆకాశాన్ని తాకిందని ఎద్దేవా చేశారు. పోలీస్‌స్టేషన్లను అడ్డంపెట్టుకుని బియ్యం, మట్టి, ఇసుక వంటి అక్రమ దందాలు చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అధికారులతోనే తనను చంపాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా నిర్విరామంగా పోరాటం చేస్తామని, మంథని నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం వచ్చే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, పూదరి సత్యనారాయణగౌడ్, బత్తుల సత్యనారాయణ, గర్రెపల్లి సత్యనారాయణ, కాయితీ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో గత ఏడాది నీటి వాటాను బదిలీ చేయండి

కేఆర్‌ఎంబీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న జలాల్లో తెలంగాణ కోటా సంబంధించిన 7.5టీఎంసీలు ఉన్నాయని, వాటిని ప్రస్తుత నీటిసంవత్సరానికి క్యారీ ఓవర్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు తెలంగాణ సర్కారు తాజాగా లేఖను రాసింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఒక నీటి సంవత్సరంలో వాడుకోలేని జలాలను తదుపరి నీటి సంవత్సరానికి బదిలీ చేయాలని ఉందని వెల్లడించింది. ఇదిలా ఉంటే క్యారీ ఓవర్ అంశంపై గతంలోనూ తెలంగాణ అనేక సార్లు విజ్ఞప్తి చేయగా, బోర్డు మాత్రం దానిని ఒకసారి అపెక్స్ కౌన్సిల్‌లో, మరోసారి ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాలని చెబుతూ వస్తున్నది.

పీసీ ఘోష్ కమిషన్ గడువు పెంపు!

- 2నెలలు పొడిగిస్తూ నేడో రేపో ఉత్తర్వులు!
- ప్రభుత్వం విధించిన 100 రోజుల గడువుత్వరలో ముగింపు

హైదరాబాద్, జూన్20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరో 2నెలలు పొడిగించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ప్రభుత్వం విధించిన 100 రోజుల నిర్దిష్ట గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో మరో 2 నెలలు కమిషన్ గడువును పొడిగిస్తూ నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే కమిషన్ ఎదుట వెల్లడించిన అంశాలన్నింటినీ 26వ తేదీలోపు అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని నిర్మాణ సంస్థలు, అధికారులకు జస్టిస్ సూచించారు. ఆ తదనంతరం ఆయా అఫిడవిట్లను పరిశీలించి విచారణను ప్రారంభించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తున్నది.

'స్టాక్ ప్రాఫిట్' మెసేజ్‌లతో మోసపోకండి

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : 'స్టాక్ ప్రాఫిట్', వాట్సాప్ నంబర్ +62815-2937-82797ను సంప్రదించండి' అంటూ వచ్చే సైబర్ చీటింగ్ మెసేజ్‌లకు మోసపోవద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏడీజీ శిఖాగోయెల్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్త తరహా సైబర్ మోసాలు వెలుగు చూస్తున్న వేళ.. వాట్సాప్‌లో'స్టాక్ ప్రాఫిట్'తో లాభాలు, +62 కోడ్ నంబర్లతో వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, ప్రాఫిట్ల నుంచి అనుభవజ్ఞులతో మాట్లాడి, ప్రభుత్వ నిబంధనలు పాటించే వాటిల్లో స్టాక్స్ చేయాలని కోరారు. ఏదైనా సైబర్ నేరానికి గురయ్యారని తెలిసిన వెంటనే, గంటలోపు (గోల్డెన్ అవర్) 1930కి కాల్ చేయాలని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

15 రెవెన్యూ డివిజన్లకు సబ్ కలెక్టర్లుగా ఐపీఎస్‌లు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్లకు ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నియామకాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఉట్నూరు, భద్రాచలం, కాటారం, బాన్సువాడ, కల్వూరు, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, అచ్చంపేట, మిర్యాలగూడ, దేవరకొండ, భైంసా, ఆర్మూర్, బోధన్, నారాయణఖేడ్, తాండూర్ రెవెన్యూ డివిజన్ల బాధ్యతలను ఐఏఎస్‌లకు అప్పగించారు.

కరీంనగర్ ఆర్టీసీ డిపో-1 మేనేజర్ సస్పెన్షన్

కరీంనగర్ తెలంగాణచౌక్, జూన్ 20 : వేధింపులు, నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఆర్టీసీ కరీంనగర్ డిపో-1 మేనేజర్ లక్కు మల్లేశం సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్కు మల్లేశం కామారెడ్డి డిపోలో పనిచేసిన సమయంలో సిబ్బందిపై వేధింపులు, దురుసు ప్రవర్తన, నిధుల దుర్వినియోగం, ప్రస్తుతం పనిచేస్తున్న డిపో-1లోనూ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులపై కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎం అంతర్గతంగా విచారణ జరిపారు. అధికారుల నివేదిక ఆధారంగా మల్లేశంను గురువారం సస్పెండ్ చేశారు.

అందుకే బస్తీ దవాఖానల్లో జీతాలివ్వలే

వైద్యారోగ్యశాఖ వెల్లడి

ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రానికి నిధులు విడుదల చేయలేదని, అందుకే తాము బస్తీ దవాఖానల్లోని సిబ్బందికి జీతాలు ఇవ్వలేదని వైద్యారోగ్య శాఖ తెలిపింది. మూడు నెలలుగా వేతనాలు అందక బస్తీ దవాఖానల సిబ్బంది పడుతున్న అవస్థలపై గురువారం 'బస్తీ దవాఖానల్లో జీతాలు బంద్' శీర్షిక పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన వార్తపై వైద్యారోగ్య శాఖ స్పందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు కేంద్రం నుంచి ఆయుష్మాన్ భారత్ నిధులు రాలేదని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ శుక్రవారం తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు.

పనిచెప్పిన టీచర్.. గాయపడ్డ విద్యార్థి

ఎంఈవో విచారణ.. టీచర్‌కి మెమో



విద్యార్థి శ్రీరాం

పెగడపల్లి, జూన్ 20: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఎల్లాపూర్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న లింగంపల్లి యోగేశ్ కొడుకు శ్రీరాం ప్రభుత్వ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాల ప్రారంభమైన కొద్దిసేపటికే మంచి నీళ్ల బాటిల్ కొనుక్కురావాలని ఓ ఉపాధ్యాయురాలు చెప్పడంతో శ్రీరాం దుకాణానికి వెళ్తుండగా కింద పడి గాయపడ్డాడు. అలాగే పాఠశాలకు రాగా ఉపాధ్యాయులు ప్రథమ చికిత్స కూడా చేయించకుండా నిర్లక్ష్యంగా ఓ పక్కన కూర్చోబెట్టారు. అదే సమయంలో యోగేశ్ పాఠశాలకు రావడంతో శ్రీరాం ఏడుస్తూ తండ్రి దగ్గరకు వెళ్లాడు. కనుబొమ్మపై గాయం కావడంతో ప్రాథమిక చికిత్స జరిపించి, గురువారం కరీంనగర్‌లోని ఓ దవాఖానలో పరీక్షలు చేయించాడు. తన కొడుకు తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నట్టు యోగేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన కొడుకు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయమై ఎంఈవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయురాలికి మెమో జారీ చేశారు.

ఐరాస విధులకు 19 మంది పోలీసులు

అంతర్జాతీయ పీస్ కీపింగ్ మిషన్ పరీక్షలో నెగ్గిన మనోళ్లు

ఐక్యరాజ్య సమితి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ పీస్ కీపింగ్ మిషన్ పరీక్షలో తెలంగాణ నుంచి 19 మంది పోలీసులు ఉత్తీర్ణులయ్యారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఇద్దరు అధికారులు ఇంగ్లిష్, డ్రైవింగ్, ఫైరింగ్ పరీక్షలు నిర్వహించగా, దేశవ్యాప్తంగా 225 మంది పోలీసు అధికారులు హాజరయ్యారు. వీరిలో 164 మంది ఉత్తీర్ణత సాధించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఈ 164 మందిలో రికార్డు స్థాయిలో తెలంగాణ నుంచి 19 మంది పోలీసులు అర్హత సాధించారు. వీరిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ దేవేందర్‌సింగ్, సీసీఎస్ హైదరాబాద్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్, నార్కోటిక్ బ్యూరో ఏసీపీ నర్సింగరావు, కమాండెంట్ అలెక్స్, నార్కోటిక్ బ్యూరో ఏసీబీ చల్లా శ్రీధర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ప్రతాప్, ఏసీపీ జూపల్లి రమేశ్, ఏసీపీ మాజిద్ అలీ ఖాన్, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ సురేశ్, విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. 19 మంది తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ నుంచి ఎంపిక కావడంతో ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. వీళ్లంతా రాబోయే రెండేండ్లలో ఏ దేశంలోనైనా అంతర్గత సంక్షోభం ఎదురైనా, శాంతిభద్రతలు గాడి తప్పినా ఐక్యరాజ్య సమితి తరపున అక్కడికి వెళ్లి శాంతిభద్రతల పునరుద్ధరణకు కృషి చేస్తారు.



జైనూర్‌లో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

డీఎస్పీ సదయ్యను సస్పెండ్ చేయాలి

- ఆదివాసీల డిమాండ్.. జైనూర్‌లో రాస్తారోకో
- పోలీసులు, సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం

జైనూర్, జూన్ 20: ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తమ హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తున్నారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసులు డిమాండ్ చేశారు. గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లోని ప్రధాన రోడ్డుపై ఆదివాసీ సంఘాల నాయకులు, రాయి సెంటర్ కుమ్రం భీం జిల్లా గౌరవాధ్యక్షుడు, గ్రంథాలయ మాజీ చైర్మన్ కనక యాదవరావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కనక యాదవరావు, నాయకులు మాట్లాడుతూ.. డీఎస్పీ సదయ్య ఆదివాసులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని, గత మే 13న ముస్లింలు వడ్డెరకాలనీపై దాడి చేస్తే కేవలం 20 మంది ముస్లింలపైనే కేసు నమోదు చేశారన్నారు. దాడుల్లో సిర్పూర్ మండలం పాములవాడకు చెందిన మర్సుకోల లక్ష్మణ్ గాయపడ్డాడని, ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సై సందీప్‌కుమార్ రాస్తారోకో విరమించాలని కోరడంతో పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎస్ఐ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

రీల్స్ సరదా ప్రాణం తీసింది

ఉరేసుకునే వీడియో తీస్తూ యువకుడి మృతి

అజయ్ (ఫైల్)

నర్సంపేట, జూన్ 20: రీల్స్ సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఉరేసుకునే వీడియో తీయబోయి ప్రమాదవశాత్తు ఉరి బిగుసుకోవడంతో మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. నర్సంపేటకు చెందిన కందికట్ల అజయ్(23) హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతడికి రీల్స్ చేసే అలవాటు ఉన్నది. మంగళవారం మల్లంపల్లి రోడ్డులో ఉన్న అతడి చిన్నక్క ఇంటికి వచ్చాడు. రాత్రి గదిలోకి వెళ్లి ఉరివేసుకునే రీల్ చేయాలని అనుకుని ఇంట్లోని దూలానికి ఉరి పెట్టుకున్నాడు. ఫ్రిడ్జ్‌పై సెల్‌ఫోన్ అమర్చి దానిని చిత్రీకరించే క్రమంలో మెడకు ఉన్న తాడు బిగుసుకొని మృతి చెందాడు. బుధవారం కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

గూడూరులో వీరగల్లు శిల్పం

చరిత్ర పరిశోధనకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి

పాలకుర్తి, జూన్ 20 : జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరులో వీరగల్లు విగ్రహాన్ని గురువారం చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. గూడూరులోని పోచమ్మ గుడి సమీపంలో 12 లేదా 13వ శతాబ్ద కాలం నాటి వీరగల్లు విగ్రహం లభించిందని తెలిపారు. వెడల్పైన ముఖం, గుండ్రంగా వేసిన సిగ, ముడి చెవికి కుండలాలు, కంఠాభరణం, గోచి ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. రెండు చేతుల్లో ఈటె